క్లుప్తంగా

మత్తుకు బానిస కావొద్దు..

మధిర: గంజాయి మత్తుపదార్థాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని మధిర కోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్తీక్‌రెడ్డి అన్నారు. బుధవారం ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చేయూత మత్తు పదార్థాల బానిసల పునరావాస కేంద్రం డైరెక్టర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. చెడు స్నేహాలు చేసి గంజాయికి అలవాటు పడి భవిష్యత్‌ను, ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని సూచించారు. సదస్సులో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ కోట వెంకట్, కన్నెపోగు వెంకటేశ్వర్లు, పీఎల్వీ సుజాత, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు డ్రిప్‌పై రాయితీలు

మధిర/తల్లాడ: ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం డ్రిప్ పరికరాలపై రాయితీ ఇవ్వనుందని మధిర, తల్లాడ ఇన్‌చార్జ్ ఉద్యాన అధికారులు ఏ.నగేష్, జి.నగేష్ వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. ఆయిల్‌పామ్, పండ్ల తోటలు, మిరప, ఇతర ఉద్యాన, వ్యవసాయ పంటలకు ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, బీసీలు, ఐదెకరాల లోపు భూమి కలిగిన ఓసీలకు 90శాతం, ఇతర రైతులకు డ్రిప్ పరికరాలపై 80శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే, తుంపర సేద్యానికి అన్ని వర్గాల రైతులకు 75 శాతం రాయితీ అందుతుందని వెల్లడించారు. ఆసక్తి ఉన్న రైతులు మీసేవ సెంటర్‌లో దరఖాస్తు చేసుకుని, వాటి కాపీలను తమకు అందించాలని సూచించారు.

ప్రభాకర్ కుటుంబాన్ని ఆదుకోవాలి



ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

చింతకాని: భూ వివాదంతో ఆత్మహత్య చేసుకున్న రైతు బోజెడ్ల ప్రభాకర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రొద్దుటూరు గ్రామంలో ప్రభాకర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించి మాట్లాడారు. బాధిత రైతు కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ప్రభాకర్ పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా అతని కుటుంబసభ్యులకు భూమి అప్పగించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటరామయ్య, వైస్ ఎంపీపీ హనుమంతరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ప్రభాకర్ కుటుంబాన్ని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ బుధవారం పరామర్శించారు. నాయకులు చావా కిరణ్, అనంతు ఉపేందర్‌గౌడ్, ఆలస్యం వీరప్రసాద్, కొండ గోపి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..



నగదు అందజేస్తున్న గౌసుద్దీన్

కారేపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ ఇంటర్ విద్యార్థి రామగిరి సంపత్‌కుమార్‌కు బీఆర్‌ఎస్ మైనారిటీ సెల్ జిల్లా నాయకుడు ఎస్.కె.గౌసుద్దీన్ బుధవారం రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంపత్‌కుమార్‌ను పరామర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు. విద్యార్థి ఆపరేషన్‌కు రూ.6లక్షలు ఖర్చు అవుతుందని.. నిరుపేద కుటుంబం కావడంతో దాతలు ఆర్థిక సాయం అందించాలని కోరారు.

మారణహోమంపై 6న నిరసన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మధిర: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణను మారణహోమాన్ని నిరసిస్తూ ఈనెల 6న దేశవ్యాప్త నిరసన దినంగా పాటిస్తున్నామని, దీనిని జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు సీవై పుల్లయ్య కోరారు. బుధవారం మధిరలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలస్తీనా 1948 నుంచి ఇజ్రాయల్ దురాక్రమణకు గురవుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి అర్జున్ రావు, వైరా, మధిర మండల కార్యదర్శి ఎలదండి బాబు, పీవైఎల్ జిల్లా కార్యదర్శి ఎన్‌వీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతా ‘మురుగు’మయం

అపార్ట్‌మెంట్ వ్యర్థాలు జాతీయ రహదారి మీదకు

- నెల రోజులుగా వెదజల్లుతున్న దుర్గంధం
- ప్రధాన రహదారి వెంట ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



అపార్ట్‌మెంట్ నుంచి వచ్చే వ్యర్థాలు



జాతీయ రహదారిపై చేరిన అపార్ట్‌మెంట్‌లోని వృథానీరు

ఆ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆ రహదారి వెంటనే ప్రభుత్వం ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. కానీ ఆ అపార్ట్‌మెంట్‌లో నుంచి వస్తున్న వ్యర్థాలు ఇక్కడి అధికారులకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నెల రోజులుగా ఈ పరిస్థితి నెలకొంది. మున్సిపల్ సిబ్బంది, అధికారులు కూడా సమస్యను చూసీచూడనట్లు వ్యవహరించడంపై మున్సిపాలిటీలో తీవ్ర చర్చ నడుస్తోంది.

వైరా: వైరాలోని తల్లాడ రోడ్డులో ఉన్న గంధం టవర్స్ (అపార్ట్‌మెంట్) గత పదేళ్ల క్రితం నిర్మించారు. అప్పుడు పంచాయతీగా ఉన్న వైరా మున్సిపాలిటీ అపార్ట్‌మెంట్‌కు ఉండాల్సిన నిబంధనలు ఏమి పట్టించుకోకపోవడంతో ఇప్పుడు ఆ అపార్ట్‌మెంట్‌లో నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, మురుగు నీరు నేరుగా జాతీయ రహదారి మీదకు వదిలి వేయడంతో.. దుర్గంధం వెదజల్లుతుంది. అపార్ట్‌మెంట్‌లో సుమారు 40 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. అదే ఆపార్ట్‌మెంట్ మండల తహసీల్దార్‌తో పాటుగా సబ్‌ఇన్‌స్పెక్టర్, ఫైర్ ఆఫీసర్ నివాసం ఉండడం కొసమెరుపు.

ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారికి ఇబ్బందులు..

జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ అపార్ట్‌మెంట్ ఎదురుగానే తహసీల్, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, ఏసీపీ కార్యాలయాలతో పాటుగా ఉమ్మడి జిల్లాకు మద్యాన్ని సరఫరా చేసే మద్యం డిపో కూడా ఉంది. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు అపార్ట్‌మెంట్ల నుంచి వచ్చే దుర్వాసనను భరించలేక ఇబ్బందులు పడుతున్నారు.

జాతీయ రహదారిపైకి మురుగునీరు..

అపార్ట్‌మెంట్ నుంచి వచ్చే మురుగనీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో, జాతీయ రహదారికి ఆనుకొని నిల్వ ఉంటుంది. అధికారులు పట్టించుకోకపోవడంతో అటుగా వెళ్తున్న ప్రజలు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే వారు ఇక్కడి సమస్యను మున్సిపల్ అధికారులకు నివేదించినా.. పట్టించుకోడం లేదరన్నారు. అసలే వర్షాకాలం.. దీంతో ఎక్కడినీరు అక్కడే నిలిపోతుంటుంది. ఈ సమస్యను పరిష్కరించాలంటే సుమారు 300 మీటర్ల పొడువు డ్రెయినేజీని నిర్మించాల్సి ఉంటుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందిస్తారా లేదా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

నోటీసులు ఇస్తాం..



అపార్ట్‌మెంట్ నుంచి జాతీయ రహదారిపై మురుగు నీరు వచ్చి నిలుస్తున్న మాట వస్తావమేనని అపార్ట్‌మెంట్ యజమానికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.

– చింతల వేణు, మున్సిపల్ కమిషనర్, వైరా

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



సత్తుపల్లి: ఎండీ రయాన్



సత్తుపల్లిరూరల్: నడ్డి చరణ్‌తేజ



వేంసూరు: అభినయశ్రీ



తల్లాడ: కొలిపాక కోటేశ్వరి

సత్తుపల్లిరూరల్/ వేంసూరు/ తల్లాడ: సత్తుపల్లి పట్టణంలోని కేపీఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎండి రయాన్ బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. పది పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించడంతో రాయాన్‌ను పాఠశాల కరస్పాండెంట్ మందపాటి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్, ఉపాధ్యాయులు అభినందించారు. అదే విధంగా సత్తుపల్లిరూరల్ మండలంలోని కాకర్లపల్లి హైస్కూల్‌కు చెందిన నడ్డి చరణ్‌తేజ, వేంసూరులోని అడసర్లపాడు పాఠశాలకు చెందిన కాలసాని అభినయశ్రీ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పదో తరగతి పరీక్షల్లో 9.8 జీపీఏ సాధించి హైస్కూళ్లలో ప్రథమ స్థానంలో నిలవడంతో వారిని ఉపాధ్యాయులు అభినందించారు. తల్లాడలోని బిల్లుపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కొలిపాక కోటేశ్వరీ పదిలో 9.5 జీపీఏ సాధించి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. విద్యార్థులను అభినందించిన వారిలో హెచ్‌ఎంలు నక్కా రాజేశ్వరరావు, శీలం శ్రీనివాసరావు, ఎ.జోజప్ప, తల్లాడ ఎంఈఓ ఎన్.దామోదర ప్రసాద్, ఉపాధ్యాయులు బాల నాగేశ్వరరావు, ఎ.రాంబాబు, మురళీమోహన్, రమాకుమారి, సుదర్శనమ్మ, థెరిస్సా, రమాదేవి తదితరులు ఉన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులు..



బాసరలో సీట్లు సాధించిన విద్యార్థులు

కారేపల్లి: కారేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు 8మంది బాసరా ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మహ్మద్ అక్తర్ తెలిపారు. అత్యుత్తమ గ్రేడ్లు సాధించిన వారిలో జె.సుప్రజ 10 జీపీఏ, జె.సృజన (9.8), ఏ.స్టెల్లా (9.8), పి.సాద్విక్(9.8), జి.నీరజ్‌కుమార్(9.7), జే.నందకిషోర్(9.7), ఏ.రక్షిత(9.7), బి.పూజిత (9.7) జీపీఏ సాధించడంతో వారిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

నిట్‌లో సీటు సాధించిన విద్యార్థికి అభినందన



విద్యార్థి సుమంత్‌ను సత్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి గరికపాటి సుమంత్ ఎన్ఐటీలో అత్యుత్తమ మార్కులు సాధించి వరంగల్ కళాశాలలో సీటు సాధించారు. బుధవారం విద్యార్థి సుమంత్, అతని తండ్రి సురేష్‌ను ఎంఈఓ వై.ప్రభాకర్‌రావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పెరుమాళ్ల శ్రీనివాసరావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం దండెం సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు శాలువలతో ఘనంగా సత్కరించి అభినంధించారు. విద్యార్థికి దండెం సత్యనారాయణరెడ్డి రూ.5వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తుంగతుర్తి వెంకటేశ్వర్లు, మారెళ్ళ సూర్యనారాయణ, ఇనపనూరి పుల్లమ్మ తదితరులున్నారు.

వైద్య సేవలు మెరుగుపరచాలి



తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మధిర: మధిర నియోజకవర్గం స్థాయిలోని ప్రధాన హాస్పటల్ అయినా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గతంలో ఉన్న 30 పలకల నుంచి 26 పడగల హాస్పటల్‌కు కుదించడానికి వైద్యాధికారుల నిర్లక్ష్యమే కారణమని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ఆరోపించారు. మధుర కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు పలకల తగ్గింపు విషయమై బుధవారం ఆయన హైదరాబాదులోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమీషనర్ని కలిసి ఫిర్యాదు చేశారు. వైద్యులు సమయపాలన పాటించడం లేదని, ఒకరిద్దరు తప్ప మిగిలిన వైద్యులంతా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మధిర ఎమ్మెల్యే భట్టితో పాటు జిల్లా వైద్యాధికారులు ఈ విషయమై విచారణ చేపట్టి వైద్య సేవలను మెరుగుపరచాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు నిమ్మటూరి రామకష్ణ, జిల్లా సమితి సభ్యుడు దామాల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్

సత్తుపల్లిటౌన్: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సురేందర్ అన్నారు. సత్తుపల్లిలోని టీజీ ఎన్‌పీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో బుధవారం అధికారులతో డీఈఈ ఎల్.రాములుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వర్షాకాలం సీజన్‌లో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడకుండా ఎప్పటికప్పుడు ట్రీకటింగ్ చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఏడీఈ యాదగిరి, ఏఈ శరత్‌బాబు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వేంసూరు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఇందు ప్రియంక సూచించారు. మండల పరిధిలోని కందుకూరు ఎస్సీ కాలనీలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీలో ప్రతి ఒక్కరి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

పారిశుద్ధ్యం అందరి లక్ష్యం



పీహెచ్‌సీలో గ్రావెల్ పోస్తున్న దృశ్యం

మధిర: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని దెందుకూరు సహకార సంఘం చైర్మన్ కోట వెంకటకృష్ణ అన్నారు. వర్షం వస్తే.. దెందుకూరు పీహెచ్‌సీ ఆవరణ మొత్తం బురదమయంగా మారుతోంది. దీంతో వెంకటకృష్ణ తన సొంత ఖర్చులతో కంకర తోలించగా.. ఆయనను పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ పృథ్వీరాజ్‌నాయక్, పారా మెడికల్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటకృష్ణతో పాటు గ్రామ పెద్దలు ఐతం ప్రసాద్ రావు, గంగరాజు, వైద్య సిబ్బంది హెచ్‌ఈఓ గోవింద్, హెచ్‌ఎస్ లంకా కొండయ్య, హెచ్.వి.బి కౌసల్య, ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


బీపీఎంకు పదవీ విరమణ సన్మానం



బనిగండ్లపాడులో బీపీఎంని సన్మానిస్తున్న సూపరింటెండెంట్ రవికుమార్

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని పోస్టాఫీస్ కార్యాలయంలో బుధవారం భీమవరం బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ భుక్యా శ్రీనివాసరావును తోటి ఉద్యోగులు ఘనంగా పదవీ విరమణ సన్మానించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ రవికుమార్, మధిర సబ్ డివిజన్ ఐపీఓ కోటేశ్వరరావు, బనిగండ్లపాడు సబ్ పోస్ట్ మాస్టర్ ఎం.గోపాలకృష్ణలు మాట్లాడుతూ.. భుక్యా శ్రీనివాసరావు సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మామునూరు బీపీఎం సత్యనారయణ, బూసిపోగు శశిభూషణ్‌రెడ్డి, పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ మృతికి సంతాపం



శ్రీనివాసరావు (ఫైల్)

ముదిగొండ: ముదిగొండ ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పెరిక శ్రీనివాసరావుగౌడ్(50)అనారోగ్యంతో హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బుధవారం మృతిచెందారు. ఆయన మృతికి ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు దుర్గ, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ సూర్యనారాయణ, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సంతాపం ప్రకటించారు.

మంత్రులకు ఘన స్వాగతం



మంత్రులు కొండా సురేఖ, శ్రీనివాసరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ దంపతులు

సత్తుపల్లిటౌన్: వనమహోత్సవంలో పాల్గొనేందుకు సత్తుపల్లికి విచ్చేసిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అటవీశాఖా మంత్రి కొండా సురేఖలను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ బుధవారం ఘన స్వాగతం పలికారు. స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంత్రులకు పుష్పగుచ్ఛాలు అందచేశారు. అలాగే, గిరిజన సాంప్రదాయ కొమ్ము నృత్యాలు, ఎన్‌సీసీ క్యాడెట్ల కవాతు, పాఠశాలల విద్యార్థులు జాతీయ పతాకాలతో మంత్రులను సభా ప్రాంగణానికి తోడ్కొని వచ్చారు. అదే విధంగా శ్రీనారాయణ కళాశాల విద్యార్థి ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో స్టేట్ టాపర్‌గా నిలిచిన శ్రీసఖవరుణ్‌ను మంత్రులు సత్కరించారు. ఈమేరకు సభలో మంత్రులు సురేఖ, పొంగులేటి మాట్లాడుతూ ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన 20 ఏళ్లుగా ఈ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు ఎమ్మెల్యే రాగమయి – దయానంద్ దంపతులు చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని కొనియాడారు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యనే ఉంటూ స్వచ్ఛంద కార్యక్రమాలు చేపడుతూ పచ్చదనం కోసం పరితపిస్తున్నారని తెలిపారు. సభ ముగిశాక హెలీకాప్టర్‌లో మంత్రులతో పాటు డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు హైదరాబాద్ బయలుదేరారు.

బొగ్గు బ్లాక్‌ల వేలం ఆపాలని వినతి

సత్తుపల్లిరూరల్: బొగ్గు బ్లాక్‌ల వేలం నిలిపివేయించడంతో పాటు నియోజకవర్గంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు సత్తుపల్లిలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సీపీఐ నాయకుడు దండు ఆదినారాయణ ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. నాయకులు తడికమళ్ల యోబు, లాల్ మహమ్మద్, షేక్ రంజాన్‌బీ, వెంకటేశ్వరరావు, శివ, నాగమణి, హమీద్, అజయ్ పాల్గొన్నారు.

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



కొణిజర్ల: రైతులకు ఎరువులు కలిపే విధానాన్ని వివరిస్తున్న ఏఓ బాలాజీ

కొణిజర్ల: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి డి.బాలాజీ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని గోపవరం, పెద్దమునగాల గ్రామాలలో పర్యటించారు. గోపవరంలో రైతులు పత్తికి ఎరువులు వేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేరు అభివృద్ధి చెందడానికి భాస్వరం అధికంగా ఉన్న ఎరువులు వేసుకోవాలన్నారు. డీఏపీ 25 కేజీలు, యూరియా 10 కేజీలతో కలిపి మొక్క దగ్గరలో చేతితో మట్టి తీసి ఎరువు వేసి మట్టి కప్పాలన్నారు. దీని వల్ల ఎరువు వృథా కాకుండా మొక్కలకు పడుతుందన్నారు. పెద్దమునగాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. మండలంలో ఇష్టానుసారం మిర్చి నర్సరీలు ఏర్పాటు చేస్తున్నారని రైతులు నర్సరీలో మొక్కలు పెంచుకోవాలంటే దగ్గరుండి విత్తనాలు పెట్టుకోవాలన్నారు. విత్తనాలు కొన్న తర్వాత పంట చివరి వరకు విత్తన ప్యాకెట్లు బిల్లులు భద్ర పరుచుకోవాలన్నారు. ఈ నెల 15 వరకు పెసర, పత్తి విత్తుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సరిత, రైతులు పాల్గొన్నారు

కారేపల్లి: మండలంలో పత్తి పంటలను మండల వ్యవసాయ అధికారి కె.ఉమామహేశ్వరరెడ్డి పరిశీలించి మాట్లాడారు. మండలంలో పత్తి పంట సుమారు 18వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారని.. ప్రస్తుతం పత్తి పంట 25 నుంచి 30రోజులదశలో ఉందన్నారు. ఈ దశలో కలుపు నివారణ చర్యలు తప్పక చేపట్టాలన్నారు. దీని కొరకు పత్తి సాళ్ల మధ్యలో అంతర సేద్యం చేసినట్లయితే చాలా వరకు కలుపు నివారణ చేయవచ్చొన్నారు. కలుపు నివారణ మందులు అయని ప్రోపా క్విజాఫాఫ్ 10% మందును మరియు పైరితయోబాక్ సోడియం మందును ఎకరాకు 250 మిల్లీలీటర్ల చొప్పున 200 లీటర్లలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. కలుపు మందు పిచికారి చేసేటప్పుడు నేలలో తేమ ఉండేటట్లు చూడాలన్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి



లచ్చగూడెం భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు వసంత

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యురాలు వల్లూరి వసంత తెలిపారు. మండల పరిధిలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలో.. ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ పిల్లలకు బుధవారం ఫిజియోథెరపీ చేశారు. అవసరమైన వారికి సహాయ పరికారాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. దీంతో శారీరక, మానసిక పరిపక్వత కనబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ ఆకారపు శివకుమార్, ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షకురాలు లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కొమరయ్య ఆశయసాధన కోసం కృషి చేయాలి

ముదిగొండ: తెలంగాణ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమరయ్య ఆశయసాధనకు కృషిచేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పాలేరు డివిజన్ నాయకుడు మాదారపు ఉమాశంకర్ అన్నారు. ఖమ్మంలోని గురువారం జరిగే దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సభకు సంబందించిన వాల్‌పోస్టర్లను బుధవారం పమ్మిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్‌రహీం, నిశాంత్, నాగయ్య. రవీందర్, నాగేశ్వరరావు, నరేష్, నరసింహారావు, రామారావులు పాల్గొన్నారు.

బావికి మరమ్మతు చేయించాలి

మధిర: మండలంలోని సిరిపురం గ్రామంలో ఉన్న బ్రిటిష్ కాలం బావికి మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. బావి కూలిపోయే స్థితిలో ఉందని.. అయితే అధికారులు నిధులు లేమితో దీనిని కూల్చడం తప్ప మారోమార్గం లేదని, దీని స్థానంలో బోరు వేయిస్తామని తెలిపారు. కానీ గ్రామస్తులు మాకు ఈ బావే.. మంచినీళ్లకు, నేలకు దిక్కని తెలిపారు. కావున ఈ బావికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

మేడేపల్లిలో మహాజన సభ

ముదిగొండ: రైతు భరోసా పథకంపై రైతుల సలహాలు, సూచనలు కోసం మేడేపల్లి సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక మహాజన సభ నిర్వహించారు. మహాజన సభలో రైతులు తమ సలహాలను, సూచనలను అందజేశారు. రైతులకు ఎన్ని ఎకరాలున్నా రైతుభరోసా ఇవ్వాలని, పది ఎకరాల లోపు వారికి ఇవ్వాలని రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వరంగల్ డిప్యూటీ రిజిస్ట్రార్ నీరజ, మేడేపల్లి సొసైటీ చైర్మన్ సామినేని వెంకటేశ్వరరావు, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీదేవి, ఏఓ రాధ, సీఈఓ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటితో సంపూర్ణం..

- ముగిసిన మండపరిషత్ సభ్యుల పదవీ కాలం
- ఐదేళ్లుగా సేవలందించిన ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు



కొణిజర్ల మండల పరిషత్ కార్యాలయం

కొణిజర్ల: మండల పరిషత్ పాలకవర్గ సభ్యుల పదవీకాలం బుధవారంతో ముగిసింది. దీంతో స్థానిక సంస్థల పాలనావ్యవస్థ పూర్తిగా ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లనుంది. ఇప్పటికే సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పుడు ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం కూడా ముగిసిపోవడంతో మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారులు రానున్నారు. మండలంలో 15 మంది ఎంపీటీసీలు, ఒక కోఆప్షన్ సభ్యుడు ఉన్నారు. మొదట సీపీఐ, సీపీఎం కాంగ్రెస్ పార్టీల పొత్తుతో బీఆర్‌ఎస్ అభ్యర్థి గోసు మధు ఎంపీపీగా ఎంపికయ్యారు. అనంతరం అన్ని పార్టీల నాయకులు కూడా బీఆర్‌ఎస్‌లో చేరడం, మళ్లీ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత ఎంపీపీతోపాటు.. పలువురు ఎంపీటీసీ సభ్యులు కూడా కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీటీసీ సభ్యురాలు పోట్ల కవిత బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఇప్పుడు వీరంతా సర్పంచ్‌లకు తోడుగా మాజీ లు కానున్నారు. గత ప్రభుత్వ కాలంలో పేరుకే ఎంపీటీసీ సభ్యులు తప్ప గ్రామాల్లో వారి పేరు మీద తట్టెడు మట్టి పోసిన దాఖలాలు కూడా లేవు. కేవలం సమావేశాలకు ప్రోటోకాల్ ప్రకారం వెళ్లడం టీ తాగి రావడం తప్ప ఐదేండ్ల కాలంలో చేసిందేమీ లేదని ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నైనా మండల పరిషత్‌కు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతున్నారు.